క్లుప్తంగా

సన్మానం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండలంలోని పారాది గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు నేమాపు వెంకటేష్‌ను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, తదితర నాయకులు కలిసి, గురువారం సన్మానించారు. పార్టీ మరింత బలోపేతానికి కృషిచేయాలని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని వేణుగోపాలనాయుడు ఆయనను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శాంతకుమారి, జేసీఎస్ కన్వీనర్ దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల దరఖాస్తుల పరిశీలన

బాడంగి: మండల వ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు, అర్హతలను అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 113 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారు నిజంగా అర్హులేనన్న విషయాన్ని ఆధారాల ఆధారంగా అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి రామలింగ్వేరరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని జయితి, కె.ఎల్.వలస, ఇప్పలవలస గ్రామాల్లో కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను ఎంపీడీవో త్రివిక్రమ్ గురువారం పరిశీలించారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందని, కొత్త వారికి జనవరి 1వ తేదీ నుంచి పింఛన్లు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

స్వెట్టర్లు, శాలువాలు వితరణ



విద్యార్థినులకు స్వెట్టర్లు అందజేస్తున్న ఉపాధ్యాయుడు శంకరరావు

తెర్లాం: మండలంలోని చుక్కవలస ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రెడ్డి శంకరరావు తన సొంత నిధులతో విద్యార్థినులకు స్వెట్టర్లు, శాలువాలు, వాటర్ బాటిల్స్‌ను గురువారం వితరణ చేశారు. శీతాకాలం నేపథ్యంలో చలి ఎక్కువగా ఉండడంతో తీవ్రమైన చలిలో విద్యార్థులు పాఠశాలకు వస్తుండడాన్ని గమనించిన ఆయన మానవతా దృక్పథంతో పాఠశాలలోని 20 మంది నిరుపేద విద్యార్థులకు వీటిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామభద్రపురం: మండలంలోని ఎస్.సీతారాంపురంలో ఖాళీగా ఉన్న ఒక వలంటీరు పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో రమామణి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎస్సీ జనరల్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 30వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



కోమటిపల్లి రైస్‌మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని కోమటి వద్ద ఉన్న కనకమహాలక్ష్మి మోడరన్ రైస్‌మిల్లును గురువారం పరిశీలించిన ఆయన రైతులు మిల్లుకు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసి, రశీదులు ఇవ్వాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు రైతుల కళ్లాల వద్దకు వెళ్లి, ధాన్యం తేమశాతం చూడాలన్నారు.

నేడు నీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని లీకులకు గురైన పైపులైన్‌ల మరమ్మతులు చేపడుతున్నామని ఏఈ వెంకట్ తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని బొబ్బిలి రోడ్డులోని అమ్మవారి గుడి సమీపం, హరిజనవీధి తదితర ప్రాంతాల్లో లీకులకు గురైన ప్రధాన పైపులైన్‌లను మరమ్మతులు చేపట్టామన్నారు. దీని కారణంగా శుక్రవారం కొండంపేట, మాదిగవీధి, హరిజనవీధి, గొల్లవీధి, చాకలివీధి, తెలగవీధి, చిన్నవీధి, ఆదర్శనగర్, అమ్మవారికాలనీ, మల్లయ్యపేట, మెంటిపేట ఎస్సీకాలనీ, కంచరవీధి, బుక్కావీధి, బొబ్బిలి రోడ్డు, లచ్చయ్యపేట ప్రాంతాలతోపాటు గోపాలపురం ట్యాంకు పరిధిలోని గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, గాయత్రికాలనీ, మెంటిపేట ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయాన్ని గమనించి, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో గురువారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉజ్వల భవిష్యత్ పొందారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్.



రాజాం సిటీ: పాగిరిలో కబడ్డీ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న యువకులు



సంతకవిటి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



రేగిడి: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో పాల్గొన్న మహిళలు



తెర్లాం: కూనాయవలసలో బ్యాటింగ్ చేసి, క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు



బాడంగి: మండల కేంద్రంలో జరిగిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న ముగడ క్రీడాకారులు



రామభద్రపురం: మండల కేంద్రంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



రాజాం: పెనుబాకలో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ బోడమ్మ



బొబ్బిలి: కలువరాయిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వేణుగోపాలనాయుడు



మెంటాడ: మరుపల్లి పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

తెర్లాం: వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు మాదాసు శేషగిరి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ అధిష్టానం పార్టీ మండల యువజన విభాగాల అధ్యక్షులను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు తనను అధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేసినందుకు గాను ఆయన ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాలకు చెందిన యువతను సమన్వయం చేసుకుని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు తనను మండల యువజన విభాగం అధ్యక్షులుగా నియమించేందుకు కృషి చేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కూడా తన ప్రత్యేక కృతజ్ఞతలని శేషగిరి అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. అన్ని ప్రాంతాలు బాగుండడంతో పాటు అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, అందుకే ఆయన అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఓ వైపు నిధులు మంజూరు చేస్తూనే మరోవైపు అన్ని వర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99.5 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, సర్పంచ్ గంట పైడిరాజు, కార్యదర్శి పక్కి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతు సంక్షేమం కోసం ఆయన అనేకానేక సంస్కరణలు చేపడుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పారాది గ్రామంలో రూ.23.94 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం) భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో అన్ని వర్గాలకు అన్ని విధాలా మేలు జరుగుతోందన్నారు. ముఖ్యంగా అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందివ్వడంతో పాటు ఆర్‌బీకేల ద్వారా విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, పంట విక్రయం వరకు ప్రభుత్వమే అన్నీ చూసుకుంటోందన్నారు.



బాడంగి: డొంకినవలసలో సచివాలయ భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

అన్ని సీజన్‌లలో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాలుగా సహాయసహకారాలు అందిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరకే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, ఎంపీటీసీ అల్లాడ ఉమా, పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావెల్లి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో రూ.64.40 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లుగా ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, గ్రామసచివాలయ కన్వీనర్ గండి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

రామభద్రపురం: జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో హౌసింగ్ డీఈ అప్పయ్య, ఏఈ సింహాచలంనాయుడులతో సమావేశమైన ఆయన ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరాతీశారు. మండలంలోని జగనన్న కాలనీలు, లబ్ధిదారుల సొంతస్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి 1915 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో 1232 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని డీఈ ఎంపీపీకి తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. జగనన్న కాలనీలలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

చురుగ్గా ఆడుదాం ఆంధ్రా పోటీలు

రాజాం: నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు చాలా చురుగ్గా, పారదర్శకంగా, విజయవంతంగా జరుగుతున్నాయని పోటీల నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దూబ సూరపునాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పలుచోట్ల జరుగుతున్న ఈ పోటీలను పరిశీలించిన ఆయన కాసేపు విలేకరులతో మాట్లాడారు. తాము నిర్దేశించిన లక్ష్యాలకు తగ్గట్టుగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నారన్నారు. రాజాంలో 4,219 మంది, రేగిడిలో 3,111 మంది, సంతకవిటిలో 3,652 మంది, వంగరలో 2,212 మంది పురుష క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, రాజాంలో 2,212 మంది, రేగిడిలో 1,706 మంది, సంతకవిటిలో 1,927 మంది, వంగరలో 1,428 మంది మహిళా క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వీరంతా వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను గుర్తించి, మండల స్థాయి, ఆ తర్వాత నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, విజేతలకు నగదు బహుమతులు కూడా అందజేస్తామన్నారు. అన్ని క్రీడామైదానాల్లో తాగునీరు, ప్రథమచికిత్స వంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

'ఆరోగ్యశ్రీ' పేదలకు గొప్పవరం

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని మరింత వేగవంతం చేయాలని, ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు గొప్పవరమని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో, పీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను పంపిణీ చేయాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్‌ను వారి స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించాలని తెలిపారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు మాత్రమే వర్తించేదని, ప్రభుత్వం ఈ నెల నుంచి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యసదుపాయం అందేలా చర్యలు తీసుకుందన్నారు. నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డు సీఎం జగన్ అందించిన గొప్ప వరమని, దీనిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెర్లాం సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఏఎన్‌ఎంలు ప్రశాంతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



తెర్లాంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీ చేస్తున్న సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి

సంక్షిప్తంగా...

దేశమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

బొబ్బిలి: స్థానిక పాతబొబ్బిలిలో దేశమ్మతల్లి ఆలయ శిఖర యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరైన మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, పుష్పాలు, గంధం, వేపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.

30న పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం ఈ నెల 30వ తేదీన లెక్కించనున్నామని ఈవో బి.వి.మాధవరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతులమీదుగా ఆంధ్రప్రభ కొత్త క్యాలెండర్ల ఆవిష్కరణ గురువారం జరిగింది. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న ప్రతిఒక్కరికీ 2024 ఓ మంచి సంవత్సరంగా నిలవాలని ఎంపీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన

రేగిడి: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై టెలీఫిల్మ్‌ల ద్వారా కేంద్రం అవగాహన కల్పిస్తోంది. మా సంకల్పం-వికసిత భారతం అనే కార్యక్రమం ద్వారా మండలంలోని ఉప్పర్నాయుడువలస, వండానపేట, వన్నలి, ఆమదాలవలస గ్రామాల్లో పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతోంది.

మేట్‌లదే బాధ్యత

రేగిడి: ఉపాధి హామీ పథకం పనులు చేయిస్తున్న వేతనదారులకు సరైన వేతనం అందేలా చూడాల్సిన బాధ్యత మేట్‌లదేనని ఏపీవో ఎస్.హరనాధరావు అన్నారు. గురువారం మండలంలోని వావిలవలస గ్రామంలో మేట్‌లకు శిక్షణ ఇచ్చారు. జాబ్‌కార్డులో ఉన్న ప్రతీ వేతనదారునికి పనులు కల్పించడంతో పాటు కొలతలు ప్రకారం పనులు చేయించాలని, రూ.272 దాటి వేతనం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, టీఏలు రవిప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో కుష్టువ్యాధి నివారణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ సిబ్బంది ఈ ర్యాలీ చేపట్టగా, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి, ప్రజారోగ్యంపై వివరాలు సేకరించారు. అలాగే కుష్టువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

గ్రామసభ

రాజాం: మండలంలోని కంచరాం గ్రామ సచివాలయం వద్ద ఉపాధి హామీ పనులకు సంబంధించి, సామాజిక తనిఖీలపై గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.70 లక్షల పనులకు సంబంధించి, నాలుగు రోజుల పాటు ఇంటింట సర్వే చేసినట్లు ఎస్‌ఆర్‌పీ చినబాబు తెలిపారు. డీఆర్‌పీల బృందం ఈ పనులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన లోపాలపై వివరాలు వెల్లడించారు.

కోరిన వారికి పనులు కల్పించాలి

రాజాం: జాబ్‌కార్డులు కలిగి, పనులు కావాలనుకున్న వారికి కోరిన వెంటనే ఉపాధి పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సాయిరాం ఉపాధి హామీ పథకం మేట్‌లకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి మేట్‌లకు పనుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. రెండుపూటలా పనిచేయించడం, కొలతల ప్రకారం పనులు చేపట్టడం, మస్తర్లు వేయడం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

బడ్జెట్ సమావేశం

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన బడ్జెట్‌కు సంబంధించి, ప్రత్యేక సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సవరణ, 2024-25 సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్లకు సభ్యులు ఆమోదం తెలిపారు.

30న ఉచిత వైద్యశిబిరం

రేగిడి: స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఈ నెల 30వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పాలకొండకు చెందిన విజయ ఆస్పత్రి ఎండీ దూబ పద్మావతి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన ఈసీజీ, హెచ్‌బీ, సుగర్ వంటి పరీక్షలు ఉచితంగా చేయబడుతుందన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలకు హెచ్‌బీ పరీక్షలు చేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన

వంగర: రైతులు దళారుల బారినపడి మోసపోవద్దని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. మండలంలోని అరసాడ, మరువాడ, కింజంగి గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన ధాన్యం కొనుగోలును పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యాన్ని ఆర్‌బీకేల వద్ద ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతోందని, 19 రైతు భరోసా కేంద్రాల్లో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 6,620 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నియామకపత్రాలు అందజేత



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ మంజు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు సచివాలయం పరిధిలో క్లస్టర్ 17, సిరిపురం సచివాలయం పరిధిలోని క్లస్టర్ 9, 22 వలంటీర్లుగా నియమితులైన డి.శారద, ఎ.సింహాచలం, లావణ్య పట్నాయక్‌లకు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ సిరిపురపు మంజు చేతులమీదుగా గురువారం నియామకపత్రాలు అందజేశారు. పారదర్శకంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సదరు నేతలు వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.పాపారావు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, తాలాడ, చిత్తారపురం, కొండగూడేం, మందరాడ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ర్యాలీ

రాజాం సిటీ: ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయాలని కోరుతూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణ ప్రధాన రహదారిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి, వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని అంబేడ్కర్ జంక్షన్ వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రమణమూర్తి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు